# తిరుగుబాటు

పెద్దకథ

ఎస్. రాములు

"అయ్యా! దేశంగాని దేశం వచ్చినం. రాజ్జెంగాని రాజ్జెం వచ్చినం. మీరుగాదంటే మాకు దిక్కెవరీడ!

దండం బెడ్తం దొర! ఈ లచ్చిని దావకాన కన్న తోల్కపోన్రి, ఎన్ని పైసలయితె అన్ని పైసలు మాకిచ్చెటాంట్ల వట్టుకోన్రి. లేకపోతె గాడి కిరాయి మందమన్న పైసలియ్యున్రి. దాన్నింటి కాడికి తోలేత్తం" ఆవేదనగా అడిగిండు అయిలయ్య.

"ఎవరుగూడ సావు రావాలని ఒగలు పెడ్తరు సారు! అది మూన్నెల్ల పసిదాన్నెత్తుకోని మట్టి మోత్తె, నిన్న కాల్వల జారి అడ్డంబడ్డకాన్నుంచి దాన్నడుమిరిగినట్టున్నది కడుపంత పిసుకుతంది. మీరు సూసుకుంటగుడ గిట్ల దయలేకుంట మాట్లాడ్తున్నరు" కండ్లల్లొ నీళ్ళు తిరుగంగ జాలిగా అడిగిండు సాయిలు.

"అరేయి! బాగా మాట్లాడుతున్నరేందిర! అది యింతగనం ఏపాటి పనిచేసిందిర. ఇప్పటి దాకా దాని మొగడు అదీ పనిచేసినయి కల్సి వాళ్ళకిచ్చిన అడ్వాన్సు మందం గూడ కాలేదు.

అయినా! మీతోని వాదన నాకెందుకుర. నేను మిమ్ములతోల్క రాలేదు. నేను మీకు అడ్వాన్సు యియ్యలేదు. మిమ్ముల తోలుక వచ్చిన ఎల్లయ్య మీ ఎదురుంగనే ఉన్నడుగదర ఆన్నే అడుక్కోన్రి." గర్జించిండు, ఏజెంటు.

"అయ్యా! నీ కాల్మొక్త! నన్నడుగుమంటున్రు మీకు తెల్వనిదేమున్నది. నేను ఈల్లతోటి ఈల్ల తీర్గనే పనిచెయ్యవట్టి. గరిబోన్ని దొర. మీరిచ్చిన అడ్వాన్సు పైసలు ఈల్లకే తోల్కరాంగ యింటికాన్నే యిచ్చేస్తి. ఇగ నాదగ్గరేడున్నయి దండం బెడ్త.

1872

జతకు నాల్గు వందలు అడ్వాన్సిత్తి. ఈడికి తోల్కవచ్చిన బడికిరాయి నూరాయె. మీరిచ్చిన పదివేల రూపాలు నలుపై మందికి అడికాడికే ఆయె. ఇగ నాదగ్గరేడున్నయి పైసలు. ఇపుడు అల్లకేమయిన కర్సయితే పెట్టుండ్రి. నా కాతాల రాసుకోండ్రి సారు. నాకు పగారిచ్చేటప్పుడు పట్టుకుందురుగని." మేస్త్రీ ఎల్లయ్య అశక్తతతో ఉసూరు మన్నడు.

"నీకు బియ్యం ఉద్దెర యిప్పిచ్చుకుంట, బీడీ కాడీ లిప్పిచ్చుకుంట, అడ్వాన్సు లిచ్చుకుంట జేత్తె యిప్పటికే నువు లేబరుతో చేయించిన పనికంటె ఎక్కువ తీసుకొన్నవు.

పదిహేను వేల రూపాల దాక నీ పేరు మీద కాతా అయింది ఇంతగనం ఎన్ని యూనిట్ల పనిచేయించినవుర నువ్వు? అంతగొత్తె నువు జేయించింది పన్నెండు వేల రూపాల పనిగాదు ఈడికే నీ పేరిట మూడు వేల రూపాయ లెక్కువ ఉన్నట్టు ఇంకేడికెల్లి వస్తయిర!

అల్లతోటి పని చేయించుకొంటున్నవు లాభం వచ్చినప్పుడెవరికిస్తవుర? లాభం తినేటోనివి కొద్దిగనన్న స్వంతం కర్చుపెట్టుకోవాలె. ఏన్నుంచన్న తీస్కొచ్చి కర్చుపెట్టుకోవాలె. ప్రతిదానికి నన్నడుగుతే యిదేమన్న ఖజాననుకున్నవ?" అన్నడు ఏజెంటు.

"మీరే గట్లంటె ఎట్ల సారు? మీరు చెప్పింది పెద్దొర కాదనడు. మీరడుగుతె పెద్దొర తప్పక యిస్తడు. మీరు తలుసుకున్నంక పైసలకు కొదువెక్కడిది సారు? మళ్ళీ అన్నడు ఎల్లయ్య మేస్త్రీ.

"అరేయి మీరు గిట్లనే అనుకుంట కూర్చుండుండ్రి. నేనీడ మీకు చెప్పుకుంట కూచుంటే ఆడ పని వంటది, పెద్దొరకు తెలిస్తె అందరి పనైతది. సప్పుడు జేక పనిజెయ్యి పొండి" అంటూ షెడ్డులోపలికి వెళ్ళిపోయిండు ఏజెంటు.

కాల్వ మీద ఇటువంటి ప్రమాదాలు జరగడం, వాళ్ళకేమీ సాయం అందకపోవడం మామూలుగా జరిగే పనే. టిప్పర్ డ్రైవరు సురేందర్ నిస్సహాయంగా, సానుభూతితో జరుగుతున్నదాన్ని చూస్తున్నాడు.

1873

* * * *

"ఆడ సక్కగ పన్దొరుకుతలేదని ఈడికత్తె వానియవ్వ కొంగపియి కోసం కాసికచ్చినట్టాయె నేంర?"

"వానియవ్వ అదేదో సర్కార్ వోపిత్తన్న కట్టని కూలెక్కువని అరం పదిరోజు లెనుకెనుక దిరిగి తోల్కచ్చెగదర మేస్త్రిగాడు."

"బాకీలు బాగున్నయి అంటె అడ్మాసిత్త బాకీలు గట్టుకోని రాన్రి అని తోల్కచ్చి గిట్ల జేసెనేంర."

"తోడేలు పంజనుంచి పులిపంజా కిందకచ్చినట్టాయె."

"మనూల్లె మట్టిపని కోతె, బాయిలు దవ్వవోతె ఏమన్నయితె దొర లెట్ల మాట్లాడ్తరో అంతకన్న కడయానం మాట్లాడెనేంర?"

"ఆడి కంటె జులుం ఎక్వ. మనూల్లె కంటె ఎక్వ దోత్తాన్రు ఈడ" మనూల్లె బాయి దవ్వవోతె రోజుకారూపాలు. ఆడోల్లకు రోజు మూరూపాలు. ఈడ రోజెనిమిది మా లెక్క గట్టిత్తరట గని అయితే ఏందె? అక్కన్నేమొ పదిగొట్టంగ పనికోయి నడుమ అద్దగంట సద్ది దిని అయిదు గొట్టం గనే యింటికత్తిమి."

"ఈన్నేమొ పొద్దున లెవ్వంగ పని కెక్కుతె పొద్దు గూకె దాక పని మీది కెల్లి దిగేది లేకాయె వాని యవ్వ"

"ఈడ ఆడి కంటె గూడ కూలి గిట్టుబాటు గాదు. ఈ మొరం బూములు దవ్వాలె. ఆడ రెండ్రోజులు జేసే పని ఈడ ఒక్క రోజులనే చెయ్యమంటున్రి."

"తిండేమొ తొమ్మిది గొట్టంగోసారి, పగటీలి రెండు గొట్టంగోసారి పొద్దుగూకి పనిమీది కెల్లి దిగినంకోసారి మూడుసార్లు మావెట్టవట్టిరి గని ఏం తిండే అది? పసులుగూడ దినయి. పేరుకు పెట్టేది అన్నమేగని గోదుమల గుడా లోతె మొద్దులకు మొద్దులుంటయి మెతుకులు. అసలు గంత దొడ్డు బియ్యం యాడ వండిత్తరో గని ఈ జన్మల జూల్లేదే అవి మనకోసం పెతాకం సర్కారు బందర్ల వడ్ల యిత్తునలదీసినట్టున్నదే" అన్నడు నర్సయ్య పొగ పీల్చుకుంట.

"వాని యవ్వ ఈ అన్నం కన్న జొన్న కూడు నయం. థు!" అన్నడు అయిలయ్య కాల్చిన బీడి ముక్క బూకేసిరాసి కాండ్రిచ్చి తుపుక్కున ఊంచుకుంట.

"మరి యిగ దాంట్ల వోసె కూర గొంత కమ్మగుంటందా వానియవ్వ కూరంటే ఏం కూరనే అది బానెడు నీల్లల్ల చింత పండు పులుసు పసికి ఉప్పు

1874

కారం గల్పి రోజదే మూడు పూటలు పొయ్యవట్టి. తాలింపా యేమన్ననా!" అన్నడు సాయిలు.

"పది యేను రోజులకో సారి పని బందు వెట్టి "మానుకం" అని కల్లు గుడాలు మాంసం మా వెట్టవట్టి. ఈడు ఎల్లయితే ఆనాడో గొర్రె పిల్ల గోత్తడు గని, అయితే ఏందె. పదిహేను రోజులు పేల్క ఎండుక పోయినంక ఏడ దినత్తది. ఏడ వత్తది."

"అయినా ఆ మాంసం పులుసుగూడ చింతపండు పులుసోలె ఉప్పుకారం వాసన దప్ప మసాల వాసన్నా యేమన్ననా?"

"గీ తిండికి మనిషికి మూడ్రూపాలు కూలిపైసల్ల కెల్లి కోసుడేంది? రూపాయి తిండి గూడ గాదిది అంటె యింక సూర్రాడు! అరానికి రెండుసార్లు కూరగాయలు వెడ్తలేనా అంటడు."

"రోజ్జేసే బానెడు చింతపండు పులుసుల కిల బీరకాయలో టమాటలో ఏసి యిదేంది పెడ్తలేవా? అంటడు వానియవ్వ"

"ఈడు మనమచ్చేదాక ఎంతమంచిగ బుదిరి కిచ్చిండుర. మంచిగ సారవోపిచ్చె వత్తననెదాక మనెంబడిదిరిగె తోల్కచ్చేలారి ఆలిసెమైతె ఆ మూడ్రోజులు రోజో గొర్రెను గోసి మంచిగ తినవెట్టె. ఈడగూడ గట్లనే తిండి వెడ్తనవె.

ఆడ మనం సారదాగి పంకలుగొడ్తె ఆడు ఈడికిదెచ్చి ఆడ వెట్టిందానికి డబలుకు శబలు మనమీద తియ్యవట్టె అన్నాడు బాలయ్య.

"ఎవో! అసలు సంగతటువెట్టి పక్క ముచ్చట్లు మాట్లాడుతున్నరేంర. ఆ పసిదాన్ని లచ్చిని ఏంజేత్తామన్నది ముందు మాట్లాడుర్రి. పొద్దుగాల ఆడేమొ గట్లనె" అన్నది కనుకవ్వ.

"అరేయి! మెల్లగ మాట్లాడుర్రి. ఎల్లిగాడు గిట్ట, ఏజెంటు బంటుగాల్లు గిట్ట యిని ఆనికి జెప్పితె బొక్కలిరుగ దంతరు."

**అంతటితో** ఆ గుంపు సంభాషణ గునుసుడుగా మారింది. వెన్నెల గుంకింది. చుక్కలు మినుకు మినుకు మంటున్నై. వాల్ల ముచ్చట చుక్కలోలె అస్పష్టంగా మారింది.

★ ★ ★ ★

1875

"ఏందిరా! లం...కొడక! బాగ మాట్లాడుతున్నవట.

మంచిగ ఎవల పని వాళ్ళు చేసుకొనేటోళ్ళకు ఏమేమొ జెప్పి పని చెడగొడుతున్నవేందిర కూసేగాడిదచ్చి మేసేగాడిదను చెడగొట్టినట్టు. మంచోల్లను చెడగొడ్తున్నవేందిర వచ్చి మూన్నెల్లు కాలేదుగని లావు మాట్లాడుతున్నవేందిర ఏండ్ల తరబడి నుండి గా పాలమూరోల్లు ఎట్లపని చేస్తుండ్రో సూడ్రి. అల్లుగూడ ఎనుకటి నుంచి మీ తీర్గగిట్ల మాట్లాడ్తె ఇగ కెనాల్సు కట్టిచ్చినట్టె. వాళ్ళు ఏండ్ల తరబడి నుంచి ఎవలు కిక్కురమనలేదు గని, మీరు నిన్న మొన్నచ్చి ఇాగ మాట్లాడుతున్నరేందిర? పాలమూరోన్ని ఒక్కొక్కన్ని తన్నుడెగాదు సంపుతె గూడ ఎవడడ్డం రాడు. ఎవరు కిక్కురుమనడు. 'అని తప్పేలేంది అన్నెందుకు సంపుతరని సోంచాయించుకొని సప్పుడు జెయ్యకుంట తప్పుచేసినోని దగ్గరకే పోవద్దని ఊరుకుంటరు''

"ఇగ మీతీర్గ అల్లుజేత్తె ఈ ఖాక్రానంగల నుంచి నాగార్జునసాగర్ దాక ఎవరు కదుదుర్రా!

మీరు గత్తె అవి యింక నూరేండ్లైన పూర్తిగాకపోవు. పాలమూరు లేబరు ఎక్కువ దొరుకుత లేరని మిమ్ముల పిలిపిస్తే పని తక్కువై మాటలెక్కువైనయి మీకు! ఎన్నడులేంది ఏందేందో గూడుపుఠాని గడుతున్నరు. మిమ్ముల జూసి పాలమూరోల్లు నేర్చుకునేటట్టున్నరు.

దానికి గింతంత దెబ్బతాకిందో లేదోగని పార్టీలు గడుతున్నర్ర!

లం...కొడుకుల్లార! బాగదిను కుంట బలిసిపోయిందిర. మీకు అరేయి! మల్లయ్యా ఈ లం...కొడుకును పెడ్డులేసి తన్ను!"

బంట్లు చెరొక రెక్క పట్టుకున్నరు. ఏజెంటు ఈ చెంప ఆచెంప తన చెయ్యి నొప్పి పుట్టేదాక కొట్టిండు, ఎటు దొరికితే అటు తన్నిండు. వాళ్ళకవ్వ జెప్పిండు.

ముక్తాయింపు విన్నంక తన్నడంలో మజా పొందనేర్చిన బంట్లు పెడ్డు లోపలికి తీసుకపోయి పొట్టుపొట్టు గొట్టిన్రు.

ఒకరి తర్వాత ఒకరికి వరుసగా అదే శిక్ష పడ్డది. అయిదుగురికి.

నర్సయ్య పండ్లల్లకెల్లి, చిదిమిపోయిన చిగుర్లలకెల్లి నెత్తురు కారికారి నోరంతా సార్కలైనయి.

కొంరయ్య నడుంబొక్క లిరిగినయి.

1876

సాయిలు కడుపునొప్పితోటి గిలగిల తన్నుకున్నడు. గడ్డపారతోటి

పురుసోల్ల మీద పొడిసినట్టయి సోయిదప్పి పేయిండు సాయిలు.

అయిలయ్య తొంటి కదిలింది నిలబడలేక అడ్డంబడితే తల పగిలింది.

ఇంత జరిగిందానికి సాక్ష్యంగా ప్రకృతితో పాటు టిప్పరు నానుకొని సురెందరూ మవునంగ ఊరుకున్నడు చూసుకుంటగూడ.

మేస్త్రీ ఎల్లయ్య జైలర్‌లా సైటుకాడ నిలబడి ఒకరి తర్వాత ఒకర్ని పెద్దువైపు పంపించింది గమనించుకుంటనే ఉన్నడు సురేందర్.

మిగతోల్లను పనిమీది కెల్లి కదిలితే తంత అన్నట్టు మెలికలు తిరిగిన కండలతో మీసాలు మెలేసి గుడ్లురజేసి సైటు మీద నిలబడితె దోపిడిదారు కావలి కుక్కోలె కనిపించిండు ఎల్లయ్య సురేందరుకు.

మిగతా యూనిట్ల లేబరు రోజూవలె తమకేమి పట్టనట్టు పనిచేస్తుండడం చూసి, వాల్లు తెలిసినా మరో కన్నీరుబొట్టు విడవడం తప్ప ఏంచెయ్యలేదు గదా అనుకొన్నడు సురేందరు మళ్ళీ.

"డ్రైవరు సారు! మీకు పుణ్యముంటది! మీరు టిప్పరు మీద తాలుకకే పోతున్నట్టున్నరు గద! కొంచెం మమ్ముల గూడ తోల్కపో రాదున్రి"

"మీరు కొంచెం తొవ్వ ముంగటికి సాగి గాతుమ్మచెట్టు కాడ నిలబడండి. అక్కడ మిమ్ముల నెక్కించుకుంటను దావకానకు కూడ తీస్కపోత! ఎట్లన్న జేసి కొంచెం ముంగట నడువున్రి. ఏజెంటుకు తెలిస్తె బాగుండదు"

"అట్లనె! అయ్య"

"నేను షాకాయిల్ కోసం పైసలు దీస్కోని వస్త. ముందుగాల నడువున్రి మీరు."

"సరె మంచిదయ్య!"

రాత్రిపూట సర్కారు దావకాన బందున్నది. సురేందరు బాయిల కట్టెలు జోకి టిప్పర్ల వేయమని చెప్పి, ఉదయం గాయపడ్డవారిని ప్రయివేటు డాక్టరుకు చూపించిండు.

ఇంజక్షన్లు యిచ్చిండు డాక్టరు. బయట కొనుక్కొమ్మని రాసిస్తె పేషంటులకు పైసలు లేవన్నరు లేబరు.

1877

తన వద్ద ఉన్న పన్నెండ్రూపాలు గాక యింకా ఎనిమిది రూపాలెక్కువ అయింది మొత్తం బిల్లు

ఎనిమిది రూపాల మందం 'ఫాకాయిల్' తక్కువ తీసికొన్నడు సురేందరు

టిప్పరు నడుస్తూనే ఉన్నది. క్యాబిన్లో కూర్చోబెట్టుకుని సురేందర్ వాళ్ళతో మాట కలిపిండు.

"ఏం జెయ్యమంటరు సారు! నిన్న గీ పసిదాన్ని దవాకానకు తోల్క పొమ్మంటే గట్ల మాట్లాడె యియ్యాల పొద్దుగాల మమ్ముల గిట్ల యిష్టమున్నట్టు గొట్టె

ఇగ యింక మీది కెల్లి దావకానకు తోల్కపోర్రని అని ఎట్లడుగు మంటరు! మీరె జెప్పుర్రి.

"ఏమనలేక నోరు మూసుకున్నం. ఏ జెయ్యత్తది"

"గిట్ల దెబ్బలకు భయపడ్తె ఎట్ల! కొంచెం దైర్యం దెచ్చుకోవాలె.

అడు మీరు గిట్ల భయపడాల్ననే కొట్టె. మీరు భయపడి ఊకుంటె వాడనుకున్నది జరిగినట్టైగద. వాడు మీ మీద యింకింత జులుం చూపిస్తడు గిట్ల ఊకుంటె

అసలు మీరు గీ చుట్టుపక్కల పల్లెలు చూల్లేదా! ఒక్కొక్క పల్లెల ఎట్ల జరుగుతాంది. ఏం జరుగుతాంది, యిన్లేదా.

అవన్ని యింటె అయ్యో! మేం పడే కట్టం ఏ పాటి అనుకుంటరు గావచ్చు మీరు.

ఈ సుట్టు పక్క ఊల్లల్ల దొరలు గిట్లనే జులుం చెలాయించిర్రు మొన్న మొన్నటి దాక.

కూలీలు, పాలేర్లు అందరు ఏకమై పనులు బందు వెట్టిర్రు. పనులు బందు వెట్టిర్రని కోపంతోటి పెద్దరైతులు దొరలు, వాళ్ళ గుడిసెలు గాల వెట్టిర్రు.

రౌడీలకు బాగా దాగిచ్చి రాత్రికి రాత్రి పట్నం నుంచి పిలిపిచ్చి కూలీల కొట్టిచ్చిర్రు.

వాళ్ళను పోలీసులకు పట్టిచ్చిర్రు. దొంగతనాలు సేసిర్రని కేసులు బనాయిచిర్రు ఆఖరికి ఊల్లెనే పోలీసు క్యాంపులు పెట్టిచ్చుకున్నరు

1878

సిన్నది సేనోసెలుకో ఉంటె అండ్లకు గొడ్లను దోలిచ్చి మేపిచ్చిన్రు. అల్లు దెంకవోతె అల్ల గొర్లమ్ముకున్నరు పోలీసులు దిన్నరు దెంకపోయి నోల్ల ఆడోల్లను చెరవట్టిన్రు.

అయితె మాత్రం వాళ్ళు ఊకున్నరా!

దొరలకు, పోలీసులకు చాకలి, మంగలి పని బందు వెట్టిచ్చిన్రు

మీరు ఎంతనన్న మొత్తుకోన్రి. ఏమన్న జెయిన్రి. మమ్ములను మర్యాదగ సూడకుంటె వగాకు కూలీలు పెంచకుంటె తెడ్డన్న పని జెయ్యం" అని పట్టిన పట్టు యిడువకుంచ నిలబడ్డరు.

దొరలసేన్లు, సెలుకలు పొలాలు సూసెటోడులేక సేసెటోడులేక పాడయి తాంటె దేవుడానుకుంట దిగివచ్చిన్రు దొరలు.

రచ్చబండ కాడికి పిలిపిచ్చి మాట్లాడిన్రు. ఏడికో ఒకాడికి కూలీలు పెంచిన్రు. గిపుడుగిపుడే జులుం యిడిసి వెట్టిత్తున్నరు.

"మీరు గూడ గట్లనే భయపడద్దు నిన్నటోలె ఎదురుబడి అడ్గాలె" అన్నడు సురేందరు.

"కాని రాజైమత్తిమి! యిక్కడ మా కెవలేర్పాటు ఏదన్నగిట్లనే ఆపదత్తె దిక్కులేని పచ్చులమైతిమి ఎవలకు చెప్పుకునుడు" అన్నరు వాళ్ళు

"అట్ల అనుకోవద్దు ఆ కూలీలు. పాలేర్లు అంతా మీ అసోంటోల్లె గదా మీకు మద్దతుగ ఉంటరు ఏదన్న జరిగినట్టు తెలిస్తే"

"అదీగాక అల్లకే యింక ఎక్కువ కష్టం మీకేంది. మీకు ఈడ యిల్లా! ఈర్వాటమా! మాపోతె పనిపోతది. యింతపని యింకోకాడ దొరకదా! మనరెక్కలు సల్లగుంటె ఏడైనా చేసుకోవచ్చు"

"మీరన్నది నిజమేననుకోండ్రి కాని...'' అలా అరగంట గడిచింట్టుంది. మాటలోనె టిప్పరు సైటు పొలిమేర చేరింది. తుమ్మచెట్టుకాడ వాళ్ళను దింపి ఏమీ తెలియనట్టె టిప్పరు షెడ్డుకేసి దూసుకుపోయింది

సురేందరు మాటలు మనుసున నింపుకున్న లేబరు అక్కణ్ణించి తమ గజంనర ఎత్తున్న తడుక గుడిసెలవైపు నడిసిన్రు సీకట్లో మెలమెల్లగ.

విశేషాల్లేని రోజులను వారం కొలబద్దతో కొలిస్తే ఒకసారికే మరొక మరక వంటి సంఘటన జరిగింది

1879

రాళ్ళకు బత్తీలు వెట్టుటానికి పొక్కలుగొట్టంగ పాలమూరోల్లిద్దరికి ఎదురు తిరిగిన గడ్డపార పాదంలోకి దిగింది.

పైకి లేసిన లావాలా రక్తం విరజిమ్మింది. నిలువెత్తు నల్లని విగ్రహాలు శవాల్లా పడిపోయిన్రు.

ఏజెంటు బంట్లు ఈ వార్త తేంగనే షెడ్డుబయట కుర్చీలో కూర్చుండి యింగ్లీషు పత్రిక చూస్తున్నాడు ఆమాత్రం లేసి షెడ్డులోపలికి పోయి మంచం మీద ఏందెల్వనోనోలె ఒరిగి పన్నడు.

"ఒరేయి మల్లయా! అయిడిన్ సీసా అవుతలనే ఉంది. నన్ను లేపకు" అన్నడు

అయిడిన్‌తో ఆగేదా? ఆ గాయం!

ఏజెంటుకు తెల్వకుండ అందుకే సురేందరు సాయం కోరిన్రు.

సురేందరు ప్రభుత్వ దావకాన్ల పట్టిగట్టిపిచ్చి, యింజక్షన్లు, కొన్ని తెల్లి గోలీలిప్పిచ్చి ఏకో పనిమీద వోయిన అదే టిప్పర్ల క్యాబిన్ల కూర్చుండవెట్టుకోని మాటగలిపిండు.

రాయలసీమ వాల్లతో లాగనే వీల్లతో గూడ మాటల్ల కల్సిపోయిండు.

"అహాఁ! మీరు గదేం బెట్టుకోకున్రి. నేను వాని చేతి కింద పనిచేత్తున్నది నిజమే గని నన్ను వాని మనిషనుకోకున్రి.

నేను గూడ మీ తీర్గనే కడుపు చేతవట్టుకోని దిక్కులేక ఇక్కడ జీతమున్న." వేగంగ వెళ్ళుతున్న టిప్పరు చప్పుడులోనే మాటలు కలిపి మాట్లాడిండు సురేందరు.

"ఏం చదువు కున్నరు"

"ఏంజదువుతె మాత్రం ఏమున్నది. ఎంత చదివినా డబ్బున్నవాని చేతికింది బానిస కొడుకులం."

"మీరు సూడవోతె బాగనె సదువుకున్నట్టున్నరు. ఏమనుకోకపోతె చెప్పరాదున్రి"

"అనుకునేదేంది గని చెప్పుకునుటానికి నాకే సిగ్గనిపిస్తాంది బియస్సే చదివిన"

1880

"గంత సదువు సదివి మీరు సెప్పుకునుటానికి సిగ్గుపడవత్తిరి...మీరెదుకు సిగ్గుపడాలె.

మీకు గంత సదువు సదివినంక గూడ కొలువియ్యని ఆ సర్కారు సిగ్గు పడాలె...మరి యీ పని ఎప్పుడు నేర్సుకున్నరు."

"మా నాన్న లారీ డ్రైవరు పనిచేస్తుండె. అప్పుడప్పుడు నాన్న వద్దన్నా ఆటలా గమ్మతుగ నేర్చుకొన్న డ్రైవింగు మానాన్న లారిబోల్తా పడి చనిపోయినంక మానాన్న వద్దన్న పనే బ్రతకటానికి అక్కరకు వచ్చింది.

ఆర్టీవో ఆఫీసుల అయిదునూర్లు మామూలిచ్చి డ్రైవరు లెసెన్సు తీసికొన్న."

"అయ్యో! పాపం! మరి మీ తండ్రి సచ్చిపోతె లారోడన్న, సర్కరోల్లన్న ఫండో అదేదో మీకేమన్న యియ్యలేదా ఇత్తె దాంతోటి ఏదన్న దంద చేసుకోవత్తుండె గద"

"లారోడు సర్కరోల్లు మనకెందు కిస్తరయ్యా! లారీ పాడైందని లారోడు యిన్సురెన్సు కంపెనీకి చెప్పుకుంటే వానికి కొత్తలారి కొనిచ్చింది పాతలారీ తీసికోని.

ఆ లారోడు పాతలారీని యిన్సురెన్సు కంపెనీ నుంచి తక్కువ ధరకు కొడుకుపేరు మీద కొని యిపుడు రెండు లారీలు నడిపించుకుంటాండు.

వాన్ని ఏమియ్యక పోతే మానెగని నన్ను డ్రైవరుగనన్న జీతముంచు కొమ్మంటె,

"మీ అయ్య జేసిన నిర్వాకం చాలు. ఇంక నిన్నుంచుకొని ఇగనేను బిచ్చమడుక్క తింట'' అని అన్నడు.

"నాయానికి కాలం లేదు సారు"

"... ... ... ... ... ... ... ... ..."

"మరి మీకు జీత మెంతిత్తుతున్నరు"

జీతం జోలిరాంగనే ఇన్నూట యాభై అన్నెప్పి యిన్నూట యాభయికి సంతకం తీసికొని యిన్నూరు చేతిల పెట్టేది యాదికచ్చినట్టుంది సురేందరుకు.

"లంజకొడుకు తెల్లందాక పొద్దుందాక రికాంలేకుండ పని చేయించుకొని యిన్నూ్రూపాలిస్తడు. నానమ్మ తాత. మా అవ్వ, ముగ్గురు చెల్లెండ్లు

1881

చిన్న తమ్ముడు గంపెడంత సంసారం ఏంజాత్తయి. ఈ ముసలితనాన గూడ మావ్వ బీడీలు జెయ్యవట్టె. పెద్ద చెల్లె యింట్లనే కుట్టుమిసను నేర్చుకుంట నెలకు అయిదో పదో సంపాయిత్తది ఈ కరువుకాలం ఎక్కడి పైసలు జాల్తన్నయి? ఓ పూటదింటె యింకోపూట ఉపాసమున్నట్టే గావట్టె''

'మీరే గట్లనవడితిరి. మాకైతె పసుల తిండివెట్టి దాన్కి సతెం పైసలు వట్టుకొని, చిల్లరకిచ్చినయి వట్టుకోని రోజుకు నాల్గు రూపాలే గద యిత్తన్నది.... ... ... ..."

వీరయ్య మాటపూర్తిగాక ముందే ఏజెంటుమీది కోపం యిటు దిప్పి అన్నడు సురేందరు.

''గిట్లంటున్ననని తప్పు వట్టకుండిగని, నిజంగ మీకు బుద్ధిలేదయ్యా! మొన్నగా రాయలసీమోల్లను ఏజెంటు, బంటుగాల్లు గంతగనం గొడ్తె మీరెవరు గూడ గిట్లేందని అడుగకపోతిరి. మీ పాలమూరోల్లను సావదన్నినా అడుగక పోతిరి ... ..." అంటూ సురేందరు పూర్తిగా కక్కక ముందే అందుకున్నడు గాలన్న.

"సదువు కున్నోల్లు అన్ని దెలిసినోల్లు మీరే సూసుకుంట సతెం ఏమనక పోతిరి. యిగ మామూలేంది చెప్పుండ్రి"

"నేనంటే నేను ... ..." తడబడిండు సురేందరు. తనలో తను సరాయించుకొని అన్నడు మల్ల.

''నేను ఎక్కువ తక్కువ మాట్లాడ్తె నన్ను నౌకర్ల కెల్లి తీసేయించి యింకోల్లను పెట్టుకుంటడు. మీ కట్ల గాదు గద. ఇపుడు చక్కగ లేబరే దొరుకుత లేదు. మీరు లేకపోతే వాని పనే బందువడె. మీరు జేస్తెనేగదా వాడు బతుకు తున్నది. గందుకోసం మీరేం మాట్లాడినా చెల్తది"

''... ... ... ..."

"వాడు మిమ్ముల నెంత దోస్తండో మీకే యెర్కాటు. ప్రభుత్వం రోజుకు ఏడుగంటలే పని చేయించుకొని ఎనిమిది రూపాలియ్యాలంటె మీ తోటి రోజుకు పన్నెండు గంటలు పని చేయించుకొని నాల్గు రూపాలే యిస్తున్నడు.''

"మాకు ఏజెంటుసారు కాదుగద పైసలిత్తున్నది. మేస్త్రి చిన రాజయ్య గద''

1882

''చినరాజయ్యనే అనుకోని. అదంత చెప్తె పెద్దకత. అయినా మీకు కొంత తెలిసిందేగద. అసలు కంట్రాక్టరు వీడు గూడ కాదు ఆ మధ్య నోసారి ఆకుపచ్చకార్ల రాలేదా! అగో వాడు. వాడు ఒక కిలోమీటరు కాల్వ దవ్వటానికి యాభైలక్షల రూపాయలకు గుత్త వట్టిండు గుత్తవట్టిన పని చేయించుటానికని ఈ టెక్నికల్ ఏజెంటును జీతం బెట్టుకొన్నడు. వీడు యింజనీరు కోర్సు చదివిండని ఎనిమిది వందల జీతమిస్తున్నడు. ఇగ వీడేం జేస్తడంటే! లేబరు గుత్తెదారు మీ చినరాజయ్య మేస్త్రి అటువంటోల్లకు కంట్రాక్టరు తరఫున మీ లాంటి లేబరును తోల్కరమ్మని కొన్ని వేల రూపాయలు అడ్వాన్సు యిస్తడు"

"మరి అడ్వాన్సు పైసలు దీసికొని ఆడు రాకపోతెఎట్ల''

"అట్లగూడ ఒకోసారి జరుగుతదనుకో-అందుకే అడ్వాన్సు యిచ్చేటప్పుడు వెనకా ముందూ అన్నీ చూస్తరు. ఉత్తుత్తోల్లను నీలాంటోల్లను, నా లాంటోల్లను నమ్మడు. ఎట్ల నమ్ముతరంటే మాటవరుసకు నువున్నవు. నువ్వీడపని చెయ్యంగ చెయ్యంగ మంచోనివని నమ్మకం గుదిరితె, నీకు పది మందిని మెప్పిచ్చే తెలివున్నదని అనుకొంటె నీకు తెల్వకుంటనే నీ ఊరు, చుట్టాలు, పక్కాలు, అన్నీ జాడదీసి తెల్సుకొంటడు. ఈ పనై పోయి యింకో కిలోమీటరు గుత్తవట్టినపుడు నిన్ను పిలిసి యాభయో నూరో లేబర్ను తోలుకురమ్మని గప్పుడు నీకు అడ్వాన్సు పైసలిస్తడు. నువ్వు నీకు తెలసిన ఊర్లు దిరిగి లేబరును తోలుకవస్తవు ఆ లేబరు తోటి నువుగూడ పనిజేస్తవు. నీకు ఒక యూనిటు పనికి 150, 160 రూ॥లు లెక్కకట్టిస్తడు-ఇగ నువ్వు దాంట్లకెల్లి నీ లేబరుకు కూలిగట్టిస్తవు. గట్ల"

"గట్లనా! ఇగ గదంట్లనే పెద్దొర కొంచెమంత లాభం సూసుకుంటడన్నట్టు" అన్నడు వీరయ్య.

''కొంచెమంత అనవద్దురే దయ్యా! మొత్తానికి మొత్తం వాడేదింటడు. అన్నమంతదిని ఎంగిలి విస్తరిచ్చినట్టు, ఉన్న కాడికి నాకి మీకింత వాసన చూపిస్తున్నట్టు యిస్తడు. వీడు ఈ కిలోమీటర్ను యాభయిలక్షల రూపాలకు గుత్తవట్టిండు గదా! గుత్తెదారు ఈ కిలో మీటరు కాలువను నాలుగైదు రీచులుగ చేసిండు ఒక్కొక్క రీచుకు భూమిగట్టిదనం, మెత్తదనం మీదికెల్లి యాభయి, అరువై వేలు అని లెక్కగట్టిండు అంటె మొత్తం కిలోమీటరుకు నాలుగయిదు లక్షల కంటె ఎక్కువకర్చుగావు. ఇగ యాభయిలక్షల రూపాయల కెల్లి నాలుగయిదు లక్షలు! పోనీ పది లక్షలు కర్చయినయనుకున్నా నలభై లక్షలు మీదమీదనే మింగుతండు గుత్తెదారు. ఇది ఒక్క కిలోమీటరుకే."

1883

"ఇగ ఈ ఏజెంటు ఈ రీచుల్ల యూనిటుపనికి యింతని కట్టిస్తడు. మీ చినరాజయ్య వంటి మేస్త్రీలు అయిదారుగురు కల్సి ఒక రీచు పని చేపిస్తరు. ఏజెంటు వీల్లకు లెక్కలుగట్టేటప్పుడు దొంగ లెక్కలు చేస్తడు. అదంత మింగుతడు. యూనిటుకు నూటరవయి అని రాసుకొని పదియిరవై తక్కువ యిస్తడు. ఇట్ల చిన రాజయ్య అటువంటివాల్లు యిరువై మంది దాక ఉన్నరు. వాళ్ళందరి పేరు మీద ఎంతెంత మింగుతండో యిగ లెక్కెయ్యని"

"యూనిట్ల లెక్క చొప్పున పైసలు దీసికొని మీ మేస్త్రి మీకు కూలి గట్టిచ్చి మిగిలింది పని చేయించిందానికింద లాభమని ఉంచుకొంటడు."

"మరి పెద్దొరకు నలువై లచ్చలు ఎట్ల మిగులుతయి"

"ఆఁ! కరట్టే! అసలు మీరు ఒక రోజు పని చేస్తే గుత్తెదారుకు యిరువైదు రూపాయలనుంచి ముప్పయి రూపాయల దాక పనిచేసినట్టు. మీ మేస్త్రి లాభం కింద ఓ రెండు మీ కూలికింద ఎనిమిది కలసి బలికి పది రూపాయలు కర్చయితే మహా ఎక్కువ. ఇగ పదిహేను రూపాయలనుంచి యిరువై రూపాయలదాక ఒక్కొక్క లేబరు పేరుమీద ఒక్కొక్క రోజుకు సంపాదిస్తుండు. ఇపుడు ఈ కిలో మీటరు పనిమీద రోజు నాలుగు వందల మంది లేబరు పనిచేస్తున్నరు. అంటే వీల్లందరి పేరుమీద వాడు ఒక రోజుకే ఎనిమిదివేల రూపాయల దాక సంపాదిస్తాండు. ఇట్ల వానివర్కు రెండుమూడు చోట్ల నడుస్తాంది. అదేదో మంత్రట ఈ గుత్తెదారుకు చుట్టమట. ఆ మంత్రి వర్కు యిప్పిచ్చె పైరవి చేస్తే ఈ గుత్తెదారు ఎలక్షన్లప్పుడు ఆ మంత్రికి డబ్బు సాయం జేస్తడని వాళ్ళు వీళ్ళు అనుకోంగ విన్న."

"అవ్వ...! అసలు పని చేసే మాకు ఆర్రూపాలు! కార్లకెల్లి కాలు కిందవెట్టకుంట అట్లచ్చి యిట్ల వోయెటోనికి గన్ని లచ్చల రూపాలు! హవ్వ! గిదేంసర్కారు! గిదేం నాయం!"

"గదంత గంగల వోనీరా! ఆడు మనం జేసిన కట్టం గంతగనం దినుకుంట గిట్ల దెబ్బలు దాకినపుడో, జరమచ్చినపుడో మందులన్న యిప్పియ్యడేందిర ఆడు? మందులిప్పిత్తె యింతగనం ఎన్ని లచ్చలొడుత్తయిర! అని సంపాదన గాలిపోను,"

"నువ్వన్నది నిజమే అసలు మీ కోసం ఒక డాక్టర్ను పెట్టుకోవాలని సర్కారు రూలున్నది. మీకు మందులు ఇప్పియ్యాలని కూడ ఉన్నది. కాని యిటువంటియన్నీ కాగితాల మీదనే ఉంటయి. మీకు మంచి 1884 వెదు

తున్నదీ లేందీ, మీ కోసం డాక్టరు ఉన్నదీ లేందీ, మందులిస్తున్నదీ లేందీ, సెలవులు యిస్తున్నదీ లేందీ యింజనీర్లు చూసుకోవాలె"

"ఇంజనీర్లంటే ఏదీ! మొన్న నల్ల జీబులచ్చి ఏజెంటు సారు తోటి మాట్లాడి సైటు జూసి పోయినోల్లు గాదు!'

"ఆఁ! వాళ్ళే"

"అల్లు మా దగ్గరి కన్న రాలేదు. ఎర్రోడున్నడు సూడు. అడు జీబు దిగిన కాన్నుంచి ముక్కుకాడ దస్తి అడ్డం పెట్టుకోని తాప తాపకు తుడుసుకున్నట్టు జేసిండు, మా దగ్గెర చెమట కంపు వాసనత్తున్నదనో ఏమో!"

"అల్లు ఏనెట్లా జరుగుతున్నదో అని సూసి అటు నుంచటే వోయిన్రు మమ్ముల మందలియ్యనన్న మందలియ్య లేదు."

"వాళ్ళెందుకు మీ దగ్గర కస్తరయ్యా! వాళ్ళకేం పట్టి! వాళ్ళకు కూర్చున్న కాడికి వేలకు వేలు లంచాలు వస్తయి ఇగ వాళ్ళు అక్కన్నే కుర్చీల కూర్చుండి మీకు అన్ని సరిగ్గున్నయని రాసి సంతకం బెడ్తరు. అట్ల రాసి సంతకం బెట్టంది ఆ గుత్తెదారు బిల్లు పాసు కాదు. పైకం రాదు. మీకు మంచితిండి పెట్టినా పెట్టకున్నా లంచాలియ్యంది బిల్లు పాసుకాదు అందుకే యింకో వేయి రెండు వేలు ఎక్కువ లంచమిచ్చి అన్ని సరిగ్గున్నయని రాయించుకొంటడు గుత్తెదారు."

"గిట్ల యింటోడే దొంగల్ల గలిస్తె యిగ ఎవలకు సెప్పుకునుడు"

"చెప్పుకునుటానికే ది చాలా మందున్నరు. మీకు గిట్ల అన్యాయం జరుగుతున్నదని లేబరాఫీసరుకు చెప్పుకోవచ్చు కాని వాని ఆఫీసేడ ఉంటదో మీకేడ దొరుకుతది ఎట్లన్న జేసి జాడదీసి దొరికిచ్చుకున్నరనుకో! వాడుమాత్రం సత్తెపూసనా! వాని కింత లంచమిస్తె వాడుగూడ మంచిగనే ఉన్నదని రాసుకొని చప్పుడు జేక పోతడు"

"ఇగ ఎట్ల"

"గందుకనే మేం గిట్లవడి సత్తన్నం ఎవనికి జెప్పుకుంటె ఏమత్తదని." సమర్థించుకొన్నడు గాలన్న.

"అంహాం! గట్లనుకుంటె ఎట్ల! అడుగాలె కొట్లాడాలె. మీరందరు కలిసి కట్టుగ నిలబడాలె. మీరందరు కలిసికట్టుగ నిలబడితే మిమ్ముల నెవడేం బీకలేడు. మీరు పనిజేత్తున్న సైటు దగ్గర్ల ఉన్న పల్లెల్ల జూడున్రి... ... ... ......" ఇంక బొగ్గు బాయిలల్ల జూడున్రి - ఏదన్న అన్యాయం జరిగితె ఎట్ల పని బందు వెడుతరో? ఆ బొగ్గు బాయిలల్ల మీకు తెలిసినోల్లు గూడ ఎవలన్న పని జేస్తుండొచ్చు. వాల్లనుగూడ యింక అడిగి తెలుసుకోన్రి. మొన్న కొన్ని రోజుల కింద కూలీలు పెంచాలని, బొగ్గు గూలి బాయిల చనిపోయినోల్లకు నష్టపరిహారం పెంచాలని పని బందు వెట్టిన్రు. అట్ల వా[illegible]జులు పని

1885

బందు వెట్టినో లేదో ప్రభుత్వం దిగివచ్చి వాళ్లు అడిగిన వాటికన్నిటికి సరే నని ఒప్పుకున్నది అటు మొకాన బీడీ కార్మికులు గూడ కూలీలు పెరుగాలె అని బందు వెట్టిన్రు. బీడీ కార్మికులైతే చాలవరకు ఆడోల్లే ఉంటరు వాల్లు గూడ కొట్లాడి సాధించుకొన్నరు. అయిదు రూపాయలున్న కూలి యిప్పుడు వెయ్యి బీడీలకు ఆర్రూపాల డెబ్బయి పైసలకు పెంచుకున్నరు. ఇంకా ప్రావిడెంటు ఫండూ, బోనసూ ఎన్నో సాధించుకొన్నరు. అడుగంది అమ్మైన పెట్టదని సామెతనే ఉండె. ఈ కాలంల అడిగినా ఎవడు పెడుతడు. అందుకే కొట్లాడాలె. పని బందు వెట్టాలె అప్పుడు వాల్లే దేవుడానుకుంట దిగివస్తరు. మీరే గనుక పని బందు వెడ్తె గుత్తెదారు నోట్లె మన్ను వడ్డటేనాయె ''

''పూటకు గతిలేనోల్లం పని బందు వెడ్తె ఎట్ల! రాజ్యంగాని రాజ్యంల దేశంగాని దేశంల దిక్కులేని సావు జావమా! అదీగాక గిట్ల జరమత్తెనే తన్ని పని జేపిత్తున్రని. గీ దెబ్బలకు మందులిమ్మని అడుగుతెనే గా రాయలసీమోల్లను ఎట్ల గొట్టిన్రో మీకు తెల్వదా !

''అది నిజమేననుకోన్రి. కానిమీరు ధైర్యంగ ఉంటే ఏదైనా అయితది. మీరు వాల్లతోటి ముందుగాల తన్నులు వడుతరు గావచ్చు. మీరే ఎదురు తిరిగితె వాల్ల గతేంగావాలె? మీకు మనిషికో తన్ను దంతె పేరుకు లేకుంటైతరు ఇంతగనం వాల్లెంత మంది? అంత గొడ్తె ముగ్గురే గద."

''మీరేమనుకోక పోతె ఓ మాటడుగల్న''

''అడుగు'' అన్నడు సురేందరు.

''మీదేవూరు''

''... ... పూరు''

''యిక్కడి కెంతదూరం ?''

''యిరువై మైల్లు''

''మీరు గింతగనం తెలిసినోల్లు, గింతదగ్గరూరోల్లు ఈ రాజ్యపోల్లు మీరే బయపడవత్తిరి. యిగ మా సంగతెట్ల చెప్పున్రి."

''నేను ముందుగాల్నే జెప్పిన నేనేమొ ఒక్కన్ని మీరేమో నూరు మందని. ఒక్కన్ని ఎన్ని దెలిస్తె ఏంజెయ్యొస్తది. మీరు కలిసి కట్టుగ ఏం జేసినా నడుస్తది''

''మీరు గట్లనే అంటరుగని మీతోటిగాంది మా తోటి ఏమైతది''

మాటల్లోనే చీకట్లోని తుమ్మచెట్టు టిప్పుర్ వెల్తురుకు కన్పించింది.

టిప్పురు రొదలాగే వాల్ల చెవుల్లో గింగిర్లెత్తించిన సురేందరు మాటలతో ఆ చీకటోలె ఆలోచనలు ముసురుకొన్నయి.

1886

(ఇంకా ఉంది).

★ ★ ★ ★